సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో రమాబాయి, అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేసిన అనంతరం కొత్త చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలితానగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

వాసుపల్లి ఆర్థిక సాయం



ఉదయ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: ఆపదలో ఉన్న వీడియో జర్నలిస్టుకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. గత కొద్ది రోజులుగా ఎడమకాలు ఎముక సమస్యతో ఇబ్బంది పడుతున్న ఉదయ్ వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం ఉదయం ఆశీలమెట్టలో గల తన కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న తోటి జర్నలిస్టుకు వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచినందుకు పలువురు జర్నలిస్టులు వాసుపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పెన్షనర్లు

సీతమ్మధార: 8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్‌ను అప్డేట్ చేయాలన్నారు. కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

తెన్నేటి పార్కు పరిశుభ్రతకు చర్యలు

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని పార్కుల్లో పరిశుభ్రతకు జీవీఎంసీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు తెన్నేటి పార్కులో తెన్నేటి విశ్వనాథం సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ సిబ్బంది సహకారంతో పార్కులో పరిశుభ్రత, పచ్చదనం పరిరక్షణకు చర్యలు చేపట్టారు. పార్కులోని పిచ్చి మొక్కలు, చెత్త తొలగించి సుందరీకరణ మొక్కలను ప్రూనింగ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పాల్గొని సహకరించారు. పార్కు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామని తెన్నేటి విశ్వనాథం సేవా సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నంబాల ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, పీసాన రాము, కోశాధికారి సనపల విజయ్ పార్కును అందంగా తీర్చిదిద్దారు.



రామకృష్ణా జంక్షన్‌లోని గతుకుల రహదారిలో ప్రయాణం



రామకృష్ణా జంక్షన్‌లో శిథిలమైన రోడ్డు

రహదారుణాలు

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు శిథిలమై పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా 34, 35 వార్డుల పరిధిలోకి వచ్చే 75 ఫీట్ రోడ్డు, అల్లిపురంలోని సింహాలదేవిడి ప్రాంతాల్లోని రోడ్లు శిథిలమై ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లోని రోడ్లు పెద్దపెద్ద గోతులు పడి ప్రయాణానికి అనువుగా లేవని వాహన చోదకులు చెబుతున్నారు. రాత్రి వేళ గోతులు కనిపించక ఎంతో మంది వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా ఈ రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- భయపెడుతున్న 75 ఫీట్ రోడ్డు
- సింహాలదేవిడి రహదారిదీ అదే పరిస్థితి
- అడుగడుగునా గోతులతో ప్రయాణం నరకం
- పాదచారులు.. వాహన చోదకుల విలవిల



రామకృష్ణా మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో గోతులు

అల్లిపురం: జీవీఎంసీ జోన్-4 పరిధిలోని 34, 35 వార్డుల మధ్య గల 75 అడుగుల రోడ్డులో ప్రయాణించాలంటే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఈ రోడ్డులో ఎక్కడ చూసినా పెద్దపెద్ద గోతులు భీతిగొలిపేలా ఉన్నాయి. డాల్ఫిన్ సర్కిల్



రామకృష్ణా థియేటర్ జంక్షన్‌లో గొయ్యి

మొదలుకొని రామకృష్ణా జంక్షన్, అటునుంచి రామకృష్ణా మార్కెట్ వరకు పెద్ద పెద్ద గోతులతో రోడ్డు శిథిలమైపోయింది. ఈ రోడ్డులో ప్రయాణించేందుకు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అడుగుకో గొయ్యితో ప్రయాణం నరకమని నిట్టూరుస్తున్నారు.

డాల్ఫిన్ సర్కిల్ మొదలు..

ఈ దారిలో ప్రయాణించే వారికి డాల్ఫిన్ సర్కిల్ నుంచి గోతులు పలకరిస్తాయి. అక్కడి గోతులను దాటుకుని రామకృష్ణా థియేటర్ జంక్షన్‌కు వచ్చేసరికి మరో భారీ గొయ్యి కనిపిస్తుంది. అక్కడ వాహన చోదకులు గోతుల్లో పడుతూ లేస్తూ ప్రయాణించాల్సి వస్తుంది. ఇలా రోడ్డంతా గోతులు పడటంతో భారీ వాహనాలు సైతం బ్రేక్ వేయక తప్పని పరిస్థితి. దీంతో ఇది నాలుగు రోడ్ల కూడలి కావటంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. అక్కడి నుంచి పూర్ణామార్కెట్, రామకృష్ణా మార్కెట్, స్టేడియంకు వెళ్లే నాలుగు రోడ్ల జంక్షన్‌లో నాలుగు వైపులా గోతులు పడటంతో ట్రాఫిక్ తరచూ నిలిచిపోతుందని స్థానికులు వాపోతున్నారు.



సింహాలదేవిడి జంక్షన్‌లో ప్రమాదకరంగా మారిన గోయి

సింహాలదేవిడి జంక్షన్‌లో..

అల్లిపురంలోని సింహాలదేవిడి జంక్షన్‌లో పనుల నిమిత్తం తవ్వి వదిలేసిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. పూడ్చిన గోతిలో పెద్ద పెద్ద సిమెంట్ రాళ్లు వేయటంతో పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గోతులు పూడ్చి, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా కరపత్రాల ఆవిష్కరణ

మహారాణిపేట: మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పలితాలు తెలిపే కరపత్రాలను బుధవారం పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉమ్మడి విశాఖ జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఎస్.విజయకుమార్ ఆవిష్కరించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.లక్ష్మి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, మత్తు మందుల నివారణ, వాటి వల్ల కలిగే దుష్పలితాలను కరపత్రాలు, పోస్టర్ల ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగించనున్నారు. అదే విధంగా ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా పలువురు ఫార్మసిస్టులను సత్కరించారు. పెందుర్తి కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నమెంటు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, పెందుర్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.కళ్యాణి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి విజయకుమార్ తదితరులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోహనరావు



హాజరైన విద్యార్థులు

మహారాణిపేట: భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మోహన్‌రావు అన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీలో సెట్విస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, మహిళల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక వ్యక్తి చెడు వ్యవసాలకు అలవాటు పడితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు ఎప్పటికప్పుడు వారిని గమనించాలన్నారు. ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు మాట్లాడుతూ చెడు వ్యవసనాలకు అందరూ దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ ఎస్.వెంకటేష్, జూనియర్ కాలేజీ అధ్యాపకులు జి.వర లక్ష్మి, ఎం.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం

సీతమ్మధార: బుధవారం ఆకస్మాత్తుగా కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. ఇటీవల విస్తారంగా వర్షాలు పడిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా ఎండాకాలాన్ని మరిపించేలా ఎండలు మండిపోతున్నాయి. ఉక్క పోతతో సతమతం అవుతున్న ప్రజలు బుధవారం ఉదయం కొద్దిసేపు కురిసిన వర్షానికి సేదదీరారు. వర్షం వల్ల విద్యార్థులు, వ్యాపారాలు ఇబ్బంది పడ్డారు. బస్టాప్‌ల వద్దకు వెళ్లి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.



వర్షానికి రోడ్డుపై పేపర్ అడ్డు పెటుకుని వెళ్తున్న యువతీ, యువకులు

మహా ధర్నాను జయప్రదం చేయండి

ఆరిలోవ: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద జూ కార్మికులతో కలిసి బుధవారం మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ తదితర కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అంతవరకు కనీస వేతనం రూ.26 వేలకు తక్కువ కాకుండా ఇవ్వాలనే డిమాండ్లతో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ధర్నాలో జిల్లాలో కార్మికులంతా కలిసికట్టుగా పాల్గొనాలని కోరారు. జూ పార్కులో సుమారు 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలతోపాటు వారాంతపు, పండగ సెలవులు కూడా లేవన్నారు. అన్ని సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న ఇటువంటి సమస్యలపై మహాధర్నాలో సీఐటీయూ నాయకులు గళమెత్తుతారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, జూ కార్మికులు పాల్గొన్నారు.



జూ గేటు వద్ద ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేత కుమార్, కార్మికులు

శాఖా గ్రంథాలయం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న గ్రంథాలయ కార్యదర్శి వెంకటరావు

అల్లిపురం: అల్లిపురంలోని బాయమ్మ జంక్షన్‌లో గల శాఖా గ్రంథాలయాన్ని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాల అమరికను పరిశీలించిన ఆయన పాఠకులతో కొంత సేపు ముచ్చటించారు. గ్రంథాలయంలోని సౌకర్యాల గురించి ఆరా తీశారు. పాఠకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రంథాలయాధికారి పీవీ నూకరాజుకు సూచనలు చేశారు. పాఠకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

మీడియా సమాజం మేలు కోరేదిగా ఉండాలి



డాక్టర్ రాము, చరిష్మా కృష్ణను సత్కరిస్తున్న అతిథులు

అల్లిపురం: మీడియా సమాజం మేలు కోరేదిగా ఉండాలని పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ రాము అన్నారు. నగరంలో ఒక హోటల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజా సంబంధాలు.. సమాజంపై దాని ప్రభావం అనే అంశంపై ప్రసంగించారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సౌత్ ఇండియా-2022 అవార్డు గ్రహీత, విశాఖకు చెందిన చరిష్మా కృష్ణను సత్కరించారు.

ఉల్లి కోసం క్యూ



ఉల్లి కోసం క్యూ కట్టిన వినియోగదారులు

సీతమ్మధార : ఇటీవల కురిసిన వర్షాలకు ఉల్లి పంట బాగా దెబ్బ తినడంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగాయి. ఈ క్రమంలో మహారాష్ట్ర, నాసిక్ నుంచి విశాఖకు ఉల్లి దిగుమతి అవుతుంది. ఉల్లి కొరతతోపాటు ధరలు పెరిగిపోవడంతో వినియోగదారులు క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సీతమ్మధార రైతు బజారులోని ఉల్లి కౌంటర్ల వద్ద వినియోగదారులు బారులు తీరారు. బుధవారం ఉదయం రెండు కౌంటర్ల వద్ద ఉల్లి విక్రయాలు ప్రారంభించడంతో వినియోగదారులు భారీగా చేరుకున్నారు. దీంతో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు వెంటనే మరో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. గత వారం కిలో ఉల్లి రూ.52 ఉండగా, ఈ వారం రెండు రూపాయలు పెరిగి రూ.54 అయ్యింది. మరోవైపు టమాట ధరలకు కూడా రెక్కలొచ్చాయి. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం బుధవారం కిలో టమాటా రూ.46కు పెరిగిపోవడంతో ఆ కౌంటర్ల వద్దకూ భారీగా వినియోగదారులు చేరుకున్నారు. మొత్తంగా రైతుబజారు వినియోగదారులతో కిటకిటలాడింది.

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి



రెయిన్‌బో ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం హెల్త్ సిటీలో గల రెయిన్‌బో, స్టార్ పినాకిల్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి ఆల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిజిస్ట్రేషన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారో లేదో పరిశీలించారు. 5 శాతం ఉచిత స్కానింగ్‌లు చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. 5 శాతం ఉచిత స్కానింగ్‌కు విడిగా రిజిస్టర్ నిర్వహించాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమని తెలిపే సైన్‌బోర్డు ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ఉండాలన్నారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు స్కానింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఒక్క ఏఎన్ఎం వ్యాక్సినేషన్ రోజున ముందుగా లబ్ధిదారుల జాబితా దగ్గర పెట్టుకోవాలని, ఆ జాబితా ప్రకారం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు క్లోరినేషన్ చేయాలని, మంచి నీరు లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలని, దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డంపర్ బిన్‌ల ఏర్పాటు తప్పనిసరి



రెల్లివీధిలో చెత్త ఎత్తిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాం: ప్రధాన రహదారుల్లో డంపర్ బిన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలో గోకుల్ రోడ్డు, రెల్లివీధి, కోడిపండ్యాల వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డుపై ఉన్న చెత్తను చూసి మండిపడ్డారు. రహదారుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తుంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు ఏం చేస్తున్నారని అన్నారు. ఎక్కడా చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డంపర్ బిన్లు లేని చోట వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రతి ఇంట్లో మూడు రకాల చెత్తబుట్టలు ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. దుకాణల వద్ద కూడా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి డంపర్ బిన్లు పెట్టించాలన్నారు. అలా చేసినప్పుడు చెత్త రోడ్డుపై వేయరన్నారు. దుకాణ యాజమానులకు మొదటిసారి తెలియపరచాలన్నారు. అప్పటికీ బిన్లు పెట్టకపోతే అపరాధ రుసుము విధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు అప్పారావు, శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అమలు చేయాలని నిరసన



వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటవర్మ డిమాండ్ చేశారు. బుధవారం పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీ గాంధీ పార్కులో థాలీ భజావో పేరిట ప్లేటు, స్పూన్లతో పెద్ద శబ్దం చేస్తూ నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిద్ర లేపేలా వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటవర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరపున సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదిరిద్దాం



జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న వెంకటరెడ్డి తదితరులు

సీతమ్మధార: గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదిరిద్దామని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో ఆవిర్భవించిన ప్లాంట్‌ను అప్పనంగా బడా వ్యాపారులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. అంబానీ, రిలయన్స్ తదితర ఉత్పత్తులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆనాడు సీపీఎం, సీపీఐ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేసి స్టీల్‌ప్లాంట్ సాధనకు కృషి చేశారన్నారు. ఈ రోజు ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ లేని విశాఖ నగరాన్ని ఊహించుకోలేమన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొండపర్తి గణనాథుని నిమజ్జనం



గణనాథుని నిమజ్జనోత్సవానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి, జాన్‌వెస్లీ తదితరులు



మేళతాళాలతో సాగిపోతున్న శ్రీ వరసిద్ధి వినాయకుడు

సీతమ్మధార: దొండపర్తి రామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయకుని నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో కమిటీ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారీ గణనాథుని నిమజ్జన ఊరేగింపునకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనను సర్వేశ్వరరెడ్డి శాలువా కప్పి సత్కరించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలతో ఊరేగింపును ప్రారంభించారు. బాణసంచా, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గణనాథుని గంగమ్మ తల్లి ఒడిలో అనుపు చేశారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఈ ఉత్సవాలు నిర్వహించడం ఐదవ సారి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ జాన్‌వెస్లీ, అజయ్, విజయ్, చింటూ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

మందు బాబులకు జరిమానా

అల్లిపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులకు టూటౌన్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో 11 మందికి రూ.10 వేల నుంచి రూ. 15 వేలు జరిమానా, వారం రోజులు జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ ఆరుగురు వ్యక్తులను కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు టూటౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ లక్ష్మి దఖలు చేసిన చార్జిషీట్ ఆధారంగా విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఐదుగురుకి రూ.10 నుంచి రూ.15 వేలు జరిమానా విధించారు. ఒకరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారు.

మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో..

మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు విచారణ చేపట్టిన కోర్టు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించింది.